
# నిదర్శనం



అదో లేడీస్ మిషనరీ హాస్పిటల్. ఆపరేషన్ థియేటర్ ముఖద్వారం వద్ద జనం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి ఉన్నారు. లోపలనుండి వచ్చే కబురుకోసం నిరీక్షిస్తున్నట్టుగా వాళ్ల మొహాలు ఆతృతను పోత పోస్తున్నాయి. సమయం రాత్రి ఒంటిగంట కావస్తుంది.

''ఆడపిల్ల పుడద్దంటారా అమ్మాయిగారికి,మొగపిల్లాడు పుడతాడంటారా?'' ఓ ముసలమ్మ ఆతృత.

''ఆడైతేనేంటి, మొగైతేనేంటి ముసల్దానా మనక్కావల్సింది బిడ్డ సొరూపం ఎట్లాగుందని గానీ'' ఓ మధ్యవయుస్కుని విసుగుతో కూడిన సమాధానం.

''పందకాడ ఎప్పుడ్నుంచో నొప్పులొత్తన్నాయి అన్నారుగదరా రెండు ఝాములు గడిసినా ఇంకా ఏ కబురూ రాలేదేటి?'' అసహనంతో కూడిన ఒకరి నిట్టూర్పు.

''అత్తమామల్ని— మొగుడ్ని ఎదిరించి ఎవరు సెప్పినా ఇనకుండా అమ్మాయిగారు అనుకున్నపని చేసేసింది పాపం ఏటవుద్దో ఏటో?'' మరెవరిదో సానుభూతి.

ఇలా ఆస్పత్రి దగ్గర మూగిన జనం ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న వ్యక్తి గురించి ఎవరికి తోచింది వారు వ్యాఖ్యానిస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

లోపల ఆపరేషన్ థియేటర్‌లో పల్లవికి సిజేరియన్ ఆపరేషన్ చేసి ఆడ శిశువును బైటకుతీశారు డాక్టర్ క్లిఫర్డు. బిడ్డను చూసిన ఆయన మొహం ఎందుకనో కించిత్తు బాధలోనూ, ఆందోళనతోనూ వివర్ణమైంది. నుదుటిపై వేళ్లతో రాసుకుంటూ..

''సిస్టర్ పల్లవిగార్కి ఆడపిల్ల పుట్టిందని బైట నిలబడ్డవాళ్లకు చెప్పిరా'' అన్నాడు ప్రక్కనే ఉన్న కుర్చీలో రిలాక్సవుతూ.

వెళ్లబోయేదల్లా ఆగి ''సార్ మరి...'' అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది సిస్టర్.

డాక్టర్ క్లిఫర్డ్ భృకుటి ముడిచి ''వాట్స్ ద ప్రోబ్లమ్'' అన్నాడు.

''అదే సార్ వాళ్లకి శిశువు గురించి యధాతథంగా చెప్పమంటారా?''

''నో...నో, ఇట్స్ టూ డేంజరస్.. అమ్మాయిగార్కి ఆడబిడ్డ పుట్టిందని, రేపు మాత్రమే చూడటాన్కి వీలవుతుందని చెప్పు. ఇంకా వివరాలు అడిగినా చెప్పకు వెళ్లు...''

''ఓకే సార్...'' అంటూ సిస్టర్ వరండాలోకి వెళ్లింది. సిస్టర్‌ను చూసి జనంలో ఒకసారిగా కలకలం రేగింది. ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ తొక్కుకుంటూ

''ఆడబిడ్డా మగబిడ్డా నర్సమ్మా!''

''పురుడు సుఖంగా వచ్చిందా?'

''బిడ్డ రూపు రేఖలు ఎట్టాగున్నాయి!''

అంటూ సిస్టర్‌పై వడగళ్ల వానలా ప్రశ్నలతో దాడి చేశారందరూ. అందర్నీ నిశ్శబ్దంగా ఉండమన్నట్టుగా చేత్తో సైగచేసి ''మీ అమ్మాయిగార్కి ఆడపిల్ల పుట్టింది. తల్లీ బిడ్డా క్షేమంగానే ఉన్నారు. రేపొద్దుట మాత్రమే బిడ్డను చూడటాన్కి వీలవుతుందని డాక్టర్‌గారు చెప్పమన్నారు. ఇహ వెళ్లిరండి'' అంటూ మరోమాటకు వాళ్లకు అవకాశం ఇవ్వకుండా డోర్స్ క్లోజ్ చేసి లోపలికివెళ్లి పోయింది సిస్టర్. బిడ్డ ఎలాగుందో చూసి వెళ్దామని ఎంత పొద్దుపోయినా పడిగాపులు పడి ఉన్న జనం సిస్టర్ చివరగా అన్న మాటలకు తగని నిరాశతో అక్కడే కాసేపు తచ్చాడి చివరికి ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

తెల్లవారుఝామువ నాల్గింటికి పల్లవికి స్పృహ వచ్చింది. చిన్నగా మూలిగి కళ్లు తెరిచి ప్రక్కకు చూసింది. పెద్ద తలకట్టు, వంకర చేతులు, కాళ్ళు, దొప్ప చెవులు, బైటకు పొడుచుకు వచ్చినట్టున్న కళ్లతో వికృతంగా ఉన్న శిశువు దర్శనమిచ్చింది. అంతే ఆమె ఒక్కసారిగా అదిరిపడింది. ఏమిటిది? తనకు జన్మించిన శిశువేనా ఇది? ఇంత వికృతంగా అష్టవంకరల్తో... ఇది కలా? నిజమా? అనుకుంటూ శిశువుపై చేయివేసి చూసింది. పచ్చి నిజం... ఇది కలగానే కాదు... అంటే తను ఓడిపోయిందా? తన విశ్వాసం, హేతుబద్ధ జ్ఞానం, విశ్లేషణాత్మకత అంతా విలువలేనిది. అర్థరహితమైనది అయిపోయిందా? ప్రజల్లో తానొక విప్లవా



త్మకమైన మార్పు తేవాలని, మానసిక పరిపక్వతను తీసుకురావాలని చేసిన ప్రయత్నమంతా వృధా అయిపోయిందా? మూఢ విశ్వాసాలదే పై చేయి అయ్యిందా? మూఢత్వానికి వ్యతిరేకంగా తాను ఉద్యమించి కాని పనులు చేసినందుకే ఇలా జరిగిందా? అసలెందుకు ఇలా జరిగింది? ఎడతెగని ఆలోచనలతో ఆమె బుర్ర అతలాకుతలమయిపోతోంది. తీవ్రమయిన మానసిక సంఘర్షణతో ఆమెకు తెలియకుండానే ''డాక్టర్'' అంటూ గట్టిగా అరచి స్పృహ కోల్పోయింది పల్లవి. ఆ అరుపుకు కుర్చీలో కూర్చుని కునుకుపాట్లు పడుతున్న సిస్టర్ ఒక్కసారిగా హడలిపోయి దడదడలాడే గుండెలతో పరుగెత్తుకొచ్చి పల్లవినోసారి పరీక్షించి చూసి స్పృహ తప్పిందని నిర్ధారించుకుని ఓ ఇంజక్షన్ చేసి తిరిగి నిద్రకు ఉపక్రమించింది.

పల్లవి ఆ ఊరి సర్పంచ్‌గారి ఏకైక కోడలు ఆమె సైన్సు పట్టభద్రురాలు. ఆమెకు హేతువాదమంటే మక్కువ ఎక్కువ. ఏ విషయమైనా హేతుబద్ధంగా ఆలోచించి దానిలోని నిజానిజాలు తెల్సుకోవటము ఆమె ప్రవృత్తి. అందరితోనూ మూఢ నమ్మకాలను గురించి ఖండిస్తూ ఎప్పుడూ మాట్లాడుతుండేది. ఆమె వాగ్ధాటికి, విశ్లేషణా పరిజ్ఞానానికి ఆమె కాలేజీలో చదివే రోజుల్లో కాలేజి ప్రిన్సిపాల్‌తో సహా అందరూ విస్మయం చెందేవారు. డిగ్రీ అయిన కొంతకాలానికి ఆమె తండ్రి ఓ సంబంధం సెటిల్ చేస్తే కట్నం లేకుండానే నిరాడంబరంగా తనకు నచ్చిన పద్ధతిలోనే మూఢ విశ్వాసాల పుట్ట అయిన ఓ మారుమూల పల్లెటూరికి కోడలైంది. తరువాత భర్త తాగుబోతు,వ్యభిచారి అని తెల్సి బాధపడినా తిరిగి మనస్థైర్యంతో భర్తలో మార్పుకోసం ఎదురుచూస్తూ, అతన్ని సంస్కరించడానికి తన ప్రయత్నాలు మాత్రం తాను చేస్తూ కాలక్షేపం చేయటం మొదలుపెట్టింది. సహజంగా ప్రజల్ని ఎడ్యుకేట్ చేయాలనే దృక్పథం ఉన్న ఆమె మావగారి తోడ్పాటుతో ఒక స్కూలును తెరచి రాత్రుళ్లు కొంత సేపు వయోజనులకు విద్యను చెబ్తూ, సమాజంపై మూఢ విశ్వాసాల దుష్ప్రభావం గురించి, పాడుబడిన పాతకాలపు సాంప్రదాయాలను ఖండిస్తూ వాళ్లకి సులభంగా అర్థమయ్యే రీతిలో ఎంతో నేర్పుగా చెప్తూ వాళ్లలో తాను ఆశించిన మార్పుకోసం కృషి చేస్తుండేది. తరతరాల్నుండి వరవరాల్లోనూ కరడుగట్టిన మూఢత్వపు పొరలను చేర్చుకుని బైటపడాలని వారి మేధస్సు పడే ప్రసవ వేదనను, మానసిక సంఘర్షణను గ్రహించ కల్గిందామె.

ఆ ఊర్లో ఒక స్త్రీ సూర్యగ్రహం రోజున పేను కుక్కితే పుట్టబోయే బిడ్డ వికృతంగా పుడతాడనే మూఢ నమ్మకం వల్ల పిచ్చిదై తన కన్నబిడ్డనే బలితీసుకున్న సంఘటన ఆమె గుండెను కలచివేసింది. గోపమ్మ అనే ఆమె అలవాటు ప్రకారం పొరపాటున తలలో పేను కుక్కితే అమ్మలక్కలు ఆమెను నీకు వికృతమైన బిడ్డ పుడతాడనే భయపెడితే ఆమె కాన్పు దగ్గరయ్యేకొద్దీ మానసికంగా తీవ్ర ఘర్షణకు లోనై చివరికి పిచ్చిదై పేగు తెంచుకుని పుట్టిన బిడ్డనే పీకనులిమి ప్రాణం తీసింది.

ఆ దుస్సంఘటన ఊరివాళ్ల నోటివెంట విన్న పల్లవి ఎలాగైనా ఆ అమాయక ప్రజలను మూఢ నమ్మకాల ఊబినుండి బైటకు లాగాలని గట్టిగా నిర్ణయించుకుంది. అందుకే ప్రజలకు నోటితో చెప్పిన దానికంటే ఏదైనా నిదర్శనంగా చేసి చూపిస్తే మంచి మార్పు కలగొచ్చనే ఉద్దేశ్యంతో గర్భిణీ స్త్రీలు గ్రహం రోజున గోళ్లు గిల్లడంగానీ, కూరగాయలు తరగడం వంటి పనులు చేస్తే పుట్టే బిడ్డకు ఏదొక అంగవైకల్యం కల్గుతుందని సమాజంలో వ్యాపించిన మూఢ నమ్మకాన్ని రూపుమాపాలని నిర్ణయించుకుందామె. అందరికీ ఆ విషయాన్ని గురించి వివరించిగర్భిణులుగా ఉన్న కొంతమంది స్త్రీలను తనకు తోడ్పడమన్నది. పెద్దలకు భయపడి సహజంగా వాళ్లలో పేరుకొన్న మూఢత్వం వల్లనూ ఎవ్వరూ ముందుకు రాలేదు. అయినా ఆమె నిరుత్సాహపడక అత్తమామలు, భర్త ఎంత చెప్పినా వినకుండా పట్టుదలతో తాను చేయదల్చుకున్న పనికి స్వయంగా పూనుకుంది. అప్పటికామె తొమ్మిది నెలల గర్భిణీ. అనుకొన్న సూర్యగ్రహణం రానే వచ్చింది. ఆమె బహిరంగంగా ఓ ప్రదర్శన చేసింది. దానితో కూరగాయలు కోసి, గోళ్ళు బ్లేడుతో తీసుకొని అందరికీ చూపించింది. స్త్రీలు చాలామంది ముక్కుమీద వేలేసుకున్నారు. అంతా వినోదంగా చూసి ఏవేవో వ్యాఖ్యానించుకుంటూ తిరిగి వెళ్లిపోయారు. కొన్నిరోజులకు పల్లవికి పురిటి నొప్పులు ప్రారంభమైనాయి. వెంటనే ఆమె మావగారు ఆ ఊరికున్న ఒకే ఒక మిషనరీ నర్సింగ్ హోంలో పల్లవిని ఎడ్మిట్ చేశారు. ఆ విషయం తెలియగానే జనం అంతా ఆస్పత్రి చుట్టూ చేరి ఆమెకు పుట్టబోయే శిశువును గురించిన సమాచారం కోసం ఎదురుతెన్నులు చూసి సిస్టర్ చెప్పిన విషయం విని అసంతృప్తిగా అటూ ఇటూ కాని ఆలోచనల్తో ఇళ్లకు దారి తీశారు.

తూరుపుదిక్కు బంగారు ముద్దలాంటి భానుణ్ణి ప్రసవించింది. ఊళ్లో జనం అప్పటికే నిత్యజీవన సమరానికి సంసిద్ధులైనట్లుగా ఎవరి పనులకు వాళ్లు తరలి వెళ్లిపోతున్నారు. చాలామంది ఆస్పత్రి దగ్గర గుమిగూడారు. బైట జనం కలకలానికి పల్లవికి మెలకువ వచ్చింది. ఆమెకంతా అయోమయంగానూ, ఖంగారుగానూ తోచింది. తనకు పుట్టిన బిడ్డ స్వరూప స్వభావాలు ఎలా ఉన్నాయో చూడటానికి, తన విశ్వాసంలోని బలాన్ని తెల్సుకోవడానికి, తన నిగ్గు తేల్చడానికి అప్పుడే జనం వచ్చేశారన్నమాట. ఇప్పుడు ఏమిటి కర్తవ్యం? పరిస్థితి కుత్తుకమీద కత్తిలా తయారయ్యింది. తను వెంటనే డాక్టర్ క్లిఫర్డును సంప్రదించాలి. ఆయనే ఈ సమస్యకు తగిన పరిష్కర్త. అంతే అనుకొని సిస్టర్ అంటూ గట్టిగా అరిచింది పల్లవి.

ఉలిక్కిపడి లేచి ఏమిటమ్మాయిగారూ! అంటూ బెడ్ దగ్గరకొచ్చి నిలబడింది సిస్టర్.

డాక్టర్ గార్కి వెంటనే ఫోన్ చెయ్యి అర్జంటుగా రమ్మనమని అంటూ ఆదుర్దాతో అరిచినట్టుగా చెప్పింది పల్లవి. గబగబా నర్స్ ఫోన్ చేసింది. కాసేపటికి డాక్టర్ క్లిఫర్డ్ హడావుడిగా వచ్చారు.

''డాక్టర్ ఏమిటిది? ఎందుకిలా జరిగింది? నేనిప్పుడు వాళ్లకి ముఖమెలా చూపించను. నా

స.భా.రావు

అత్తమామల్ని భర్తను కూడా ఎదిరించి చేసిన పనికి చివరికి ఫలితం ఇదా? నేను నమ్మిన సిద్ధాంతం ఇంత బలహీనమైనది, సత్తాలేనిదేనా? మూఢనమ్మకాలకి తలవంచక తప్పదా? ఇహ నేను ఓడిపోయినట్టేనా డాక్టర్'' అంటూ ఆవేదనగా అంది పల్లవి.

''డోంట్ అప్సెట్ బేబీ, నువ్వెప్పటికీ ఓడిపోవు ఇందులో నీ తప్పేంలేదు. నీ కేసు నేను పూర్తిగా స్టడీ చేశాను. ఇది కేవలం నీ భర్త జరిపిన విచ్చలవిడి వ్యభిచారం వల్ల మాత్రమే నీకీ వికృత శిశువు జన్మించటం జరిగింది. అంతేకానీ గ్రహణ దోషం వల్ల ఎంత మాత్రం కాదు. సో యూ ఆర్ గ్రాండ్ సక్సెస్ ఇన్ యువర్ వర్క్, దట్సాల్, అన్నారు సాలోచనగా డాక్టర్ క్లిఫర్డు.

కానీ డాక్టర్ ఈ విషయం మనం చదువుకున్న వాళ్లం కాబట్టి అర్థం చేసుకోగలం. కానీ ఏమాత్రం శాస్త్రీయ పరిజ్ఞానంలేని ఈ మనుషుల్ని ఎలా సమాధానపర్చగలం. ఎలా వాళ్లకీ విషయం ప్రూవ్‌చేసి చెప్పాలి. ఇంపాజిబుల్ డాక్టర్ ఇట్స్ హైలీ ఇంపాజిబుల్' అంటూ తల పట్టుకుని భారంగా బెడ్‌పై వెనక్కి జారబడింది పల్లవి.

'నో బేబీ నిరుత్సాహపడకు. ఇంతకాలం నువ్వు ప్రజల్లో మూఢనమ్మకాల్ని రూపుమాపడానికి ఎంతో శ్రమించావు. అయితే నువ్వు చేసిన శ్రమంతటికీ ఫలితాన్ని మాత్రం ఈరోజు చవిచూడబోతున్నావు. ఇదే శిశువుని వాళ్లకి యధాతథంగా చూపిస్తే ఇంత కాలం నీ ఆశయం కోసం ఆదర్శం కోసం నువ్వు ఖర్చుచేసిన ప్రతి స్వేదబిందువూ బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోతుంది. అందుకనే తప్పైనా ఒప్పైనా నేనొక ఆలోచన చేశాను. ఈ వికృత శివువు మాయం చేసి ఆ స్థానంలో మరో శిశువుని ఉంచాలి. అది మాత్రమే ఈ సమస్యను పరిష్కారం కాగలదు అన్నారు డాక్టర్ క్లిఫర్డు గంభీరంగా.

''నో..నో డాక్టర్ నేను అంతమందిని మోసం చెయ్యలేను. వాళ్లకు మార్గదర్శిగా ఉండవల్సిన నేనే ఇటువంటి పని చెయ్యడం తగదు.. అది నా ప్రవృత్తికే విరుద్ధం! అంది ఆవేశంగా పల్లవి. అయినా తప్పదు బేబీ ఒక ఉన్నత ఆశయ సిద్ధి క'సం ఓ చిన్న నిజాన్ని చంపడం దోషమేమీ కాదు. అదీకాక ఈ శిశువుని చూసిన వెంటనే వాళ్లలో కలిగిన విపరీతమైన మానసిక తిరోగమన మార్పుని చూసి నీ హృదయం అశాంతి పాలౌతుంది. నీలోని సంస్కరణాభిలాష చచ్చిపోతుంది. మునుపటి ఉత్సాహం ముక్కచెక్కలైపోతుంది. ఒక చిన్న మార్పుతోనే జీవితాశయాన్ని బతికించుకుంటావో, పరిస్థితిని అవగాహన చేసుకోకుండా మోసం చేయకూడదనే మూఢత్వంతో భవిష్యత్తుని భగ్నం చేసుకుంటావో నీ ఇష్టం. అంటూ ఇంక తాను చెప్పవలసిందేమీ లేదన్నట్టుగా కుర్చీలో కూలబడ్డారు డాక్టర్ క్లిఫర్డు.

పల్లవి ఆలోచనలో పడింది. ఆమె మెదడు అస్తవ్యస్త ఆలోచనల్తో మరిగిపోయింది కాసేపు. చివరికి తలపైకెత్తి ''సరే డాక్టర్ మీరు చెప్పినట్టే చేద్దాం'' అంది. డాక్టర్ క్లిఫర్డు మొహంపై ఓ మందహాసం మెరిసింది. ఆమె అన్నా ఆమె సిద్ధాంతమన్నా ఆయనకు ఎనలేని అభిమానం, గౌరవం. ఒక నిర్దిష్ట ఆశయం కోసం, ఆదర్శం కోసం స్థిరచిత్తంతో శ్రమించే వారంటే ఆయనకెప్పుడూ గౌరవమే.

అదిసరే డాక్టర్ ఇప్పటికిప్పుడు శిశుమార్పిడి ఎలా సాధ్యం. బైట జనం కలకలం విన్నారా? అంది ఆందోళనగా పల్లవి.

''డోంట్ వర్రీ బేబీ ఆ ఏర్పాట్లన్నీ నేనెప్పుడో చేసేశాను'' అంటూ సిస్టర్‌కు సైగ చేశాడు డాక్టర్ క్లిఫర్డు.

సిస్టర్ లోపలికెళ్లి ఓ ఆరోగ్యవంతురాలైన శిశువుని తెచ్చి ఆమె ప్రక్కలో పడుకోబెట్టి ఆ వికృత శిశువుని లోపల దాచేసింది. పక్కలో ఉన్న బిడ్డను చూస్తూ ఎవరి రక్తం పంచుకుపుట్టినబిడ్డో ఈ క్షణం నుండి నా బిడ్డగా మారి ఒక ఆశయ సిద్ధి కోసం తోడ్పడుతుంది. పుట్టగానే ఈ శిశువు జన్మసార్థకమైంది. నిజంగా ఎంత చిత్రం అనుకుంది పల్లవి మనసులో. బైట జనం కలకలం ఎక్కువైంది. ఆమె గుండెల్లో ఎందుకనో సన్నగా కలవరం మొదలైంది.

''సిస్టర్ తలుపులు తెరచి జనాల్ని మెల్లగా లోపలికి పంపించు చూసి వెళతారు అన్నాడు డాక్టర్ క్లిఫర్డ్. సిస్టర్ తలుపులు తెరచింది. జనం బిలబిలమని లోపలికి రాబోయారు. వాళ్లని ఆపి బేచ్‌లుగా లోపలికి పంపించింది సిస్టర్.

వాళ్లూహించిన దానికి పూర్తిగా భిన్నంగా ఉన్న శిశువుని చూసి అందరూ దాదాపు విస్మయం చెందారు. 'అరె బిడ్డ పండులాగుందే. ఓ కాలొంకరలేదు. సెయ్యొంకరలేదు. అంతా మన ఎర్రేగాని గేణాల్లో ఏమీలేదన్నమాట చూడండి.. చూడండి'' అన్నాడో తరతరాల ఛాదస్తాన్ని తెలిసిన తాతొకడు.

''అవ్వ్రనా పెదెం బొర్రడద్ది, ముక్కు బొర్రడద్ది అంటారు. అంతా మన ఎర్రేనేమో.. ఈ సిన్నమ్మాయిగారే ఆయాల దయిర్యం చేసి మనందరి ఎదురుగుండా అయ్యన్నే సేసి సూయించకపోతే మనమింకా ఆ సేదస్తం లోనే పడుందుమేమో''

''అయితే ఇన్నాళ్లూ అమ్మాయిగారు సెప్పినయ్యన్నీ నిజాలేనన్నమాట''

''నిజాలేనంటావేట్రా ఎర్రిమొగమా ఎదురుగా నిదర్శనం కనబడ్డంలేదా''?

ఇలా ఎవరికి తోచింది వారు వ్యాఖ్యానిస్తూ తల్లినీ బిడ్డనీ ఆశీర్వదించి సంతృప్తిగా వెళ్లిపోయారు. వాళ్లందరి మాటలూ విని ఇప్పుడున్న స్థానంలో ఆ వికృత శిశువే ఉంటే వాళ్ల ప్రవర్తన, మేథాస్థితి ఎంత భయంకరంగా మూఢత్వంలో పడిపోయుండేదో ఊహించుకోగానే ఆమె గుండె భయంతో జలదరించింది. కన్నీళ్లు చెక్కిళ్లపై జాలువారుతుండగా తన భవిష్యత్తును తేజోమయం చేసిన డాక్టర్ క్లిఫర్డు వైపు కృతజ్ఞత నిండిన కళ్లతో చూస్తూ చేతులు జోడించింది పల్లవి. ఆమె వైపు అనునయంగా, అభిమానంగా చూస్తూ చిరునవ్వు నవ్వాడు డాక్టర్ క్లిఫర్డు. ఆయన చిరునవ్వునే ఆశీర్వాదంగా తీసుకుంది పల్లవి. ●

